క్లుప్తంగా

దుర్గామాత పూజ వస్త్రాల వేలం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గని మైసమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత పూజకు వినియోగించిన వస్త్రాలను శనివారం వేలం వేశారు. గని ఆవరణలో నిర్వహించిన వేలంలో కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజకు ఉపయోగించిన కలశంను మేడ మహేష్ అనే కార్మికుడు రూ.11,016 వేలంలో దక్కించుకున్నారు. చీరలను వేలం వేయగా రూ.30వేలు ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.41వేలు ఆదాయం వచ్చినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హా, గని రక్షణ అధికారి రాజు, డబ్ల్యూటీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నాయకులు దాసరి శ్రీనివాస్, తిరుపతి గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రచార రథం అడ్డగింత



ప్రచార రథం ఎదుట మహిళలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో బీఆర్‌ఎస్ ప్రచార రథాన్ని మహిళలు అడ్డుకున్నారు. గ్రామంలో బీటీ రోడ్డు లేదని, ఉన్న సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



మంచిర్యాలఅగ్రికల్చర్: కలెక్టర్ బదావత్ సంతోష్ జన్మదినం సందర్భంగా శనివారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టరేట్ ఉద్యోగులు, టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులు పూల బొకే, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు మల్లయ్య, హన్మంత్‌రెడ్డి, రాంకుమార్, తిరుపతి, అశోక్, శ్రీనివాస్ వివిధ శాఖలకు చెందిన కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెడీ మిక్స్ ప్లాంట్‌తో ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆండాలమ్మ కాలనీలో వీరాంజనేయ రెడీమిక్స్ ప్లాంట్‌ను మూడేళ్లుగా నిర్వహిస్తున్నారని, దాని నుంచి వెలువడే డస్ట్, గాలి కాలుష్యం, వ్యర్థ నిర్వహణ సరిగ్గా లేక తమ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీకి చెందిన పలువురు శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. రెడీమిక్స్ ప్లాంట్ వారు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని పలుమార్లు చెప్పినా, వినిపించుకోవడం లేదని, బాధ్యతా రాహిత్యం వల్ల కాలనీ ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. రెడీమిక్స్ ప్లాంట్‌ను అనుమతులు లేకుండా, రక్షణ చర్యలు తీసుకోకుండా నడిపిస్తున్నారని, తక్షణ చర్యలు తీసుకుని కాలనీ ప్రజలను దుమ్ము, కాలుష్యం నుంచి రక్షించాలని కోరారు.

'ఇంటింటా బీజేపీ ప్రచారం'

బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి అన్నారు. బెల్లంపల్లి కన్నాల బస్తీలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థినైన తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుల్గం తిరుపతి, రాజులాల్, మహేష్, మల్లేష్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సతీమణి స్రవంతి రఘునాథ్ శనివారం జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతగర్మిళ్లలోని ఇంటింటికీ వెళ్లి, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పేద ప్రజల సంక్షేమం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం: ఆదిలాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా ఎంపిక పోటీల్లో మంచిర్యాల జిల్లా నుంచి పాల్గొన్న జన్నారం మండల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి యోగా పోటీల్లో మంచిర్యాల జిల్లాలో జన్నారం మండలం రోటిగూడకు చెందిన ఎన్.మణితేజ అండర్ 14విభాగంలో, ఎస్.హర్షిత్‌సాయి అండర్ 17విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు యోగా మాస్టర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివనూరి తిరుపతి తెలిపారు. ఈ నెల 30న సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

సిద్ధమవుతున్న ప్రమిదలు

చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాతో పాటు చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లి, బావురావుపేట, అక్కెపల్లి, కత్తెరసాలతో పాటు కోటపల్లి మండలం షెట్‌పల్లి, వెలమపల్లి, బబ్బరచెలుక, వెంచపల్లి, సుపాక గ్రామాల్లో మట్టితో కుండలు, ప్రమిదల తయారీ జోరందుకుంది. వివిధ ఆకృతుల్లో కుండలు, కూజాలను తయారు చేస్తున్నారు. వివాహ శుభకార్యాలు, దీపావళి సమయాల్లో అధికంగా గిరాకీ ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీపావళి సీజన్‌లో డజన్ ప్రమిదలకు రూ.20నుంచి రూ.30వరకు పలుకుతుండగా, చిన్న కుండకు ఒక్క దానికి రూ.50వరకు ధర పలుకుతోంది.



కుమ్మరులు తయారు చేసిన ప్రమిదలు



చక్రం తిప్పుతూ ప్రమిదల తయారీ

ఏళ్లుగా ఇదే పని..



ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పని చేస్తున్నాను. మా తాత, తండ్రి ఇదే పని చేశారు. వివాహ శుభ కార్యాలకు, దీపావళి పండుగకు గిరాకీ ఉంటుంది. గతంలో చాలా మంది మా దగ్గరికి వచ్చే కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం మేమే మార్కెట్లకు తీసుకెళ్తున్నాం.

– రాజన్న, కుమ్మరి

ఆదరణ తగ్గుతోంది..



చెరువు మట్టితో ప్రమిదలు, కుండలు సారెపై తయారు చేస్తాం. ఈ ఏట మట్టిని కోటపల్లి మండలం శంకరాపూర్ గ్రామం నుంచి తీసుకొచ్చాను. గతంలో దీపావళి పండుగకు ప్రమిదలకు గిరాకీ భాగా ఉండేది. ప్రస్తుతం వారం రోజుల పాటు మేం తయారు చేసిన కుండలు, ప్రమిదలు అమ్ముతున్నాం.

– మహేష్, కుమ్మరి

ఘనంగా వాల్మీకి జయంతి

నెన్నెల: మండల కేంద్రంలోని హన్మాన్ మందిర్‌లో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని నెన్నెల వాల్మీకి యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. బోయవాల్మీకిలు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ముందుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోయవాల్మీకి యూత్ సభ్యులు రాజు, గోగు రాజు, ముస్కె రామన్న, బండి రాకేష్, వెంకటేష్, శ్రీశైలం, రాజు, సాయి, గణేష్, అంజిలు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘనాయకులు బొమ్మెన లక్ష్మీరాజం, మల్లేష్, గంగాధర్, సత్తన్న, మహేష్, గోపి, ముస్కె రాజన్న, లచ్చన్న, కార్తీక్, కముటం రామన్న, నారాయణ, గంగన్న, మీసుగు అంజన్న, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: వేడుకల్లో వాల్మీకి బోయలు

నాటుసారా పట్టివేత

నెన్నెల: మండలంలోని పెద్దలంబాడితండా శివారులో శనివారం 60లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నెన్నెల పెద్దలంబాడితండాకు చెందిన దరావత్ రవీందర్ అనే వ్యక్తి బైక్‌పై 800గుడుంబా ప్యాకెట్లు(60 లీటర్లు) తీసుకొని వేమనపల్లికి వెళ్తుండగా తమకు అందిన పక్కా సమాచారం మేరకు పట్టుకొని నాటుసారా ప్యాకెట్లతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'పైప్‌లైన్ నిర్మాణ పనులపై అభ్యంతరం'

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హమాలివాడలో 60ఫీట్ల రోడ్డుకు పైప్‌లైన్ నిర్మాణ పనులపై స్థానికులు అభ్యంతరం తెలపడంతో శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ స్థానికులతో మాట్లాడారు. హమాలివాడలో 60ఫీట్ల రోడ్డు కోసం గతేడాది వెడల్పు పనులను చేపట్టగా, అడ్డుగా ఉన్న ఇళ్లను రోడ్డు కోసం తొలగించారు. కానీ రోడ్డులోకి వచ్చి నిర్మించిన ఒక భవనాన్ని తొలగించకపోవడంపై కాలనీ వాసులు అభ్యంతరం తెలిపారు. అంతటా 60ఫీట్లకు రోడ్డు వెడల్పు చేసి, కేవలం పలుకుబడి కలిగిన ఇళ్లను వదిలేసి, పైప్‌లైన్ కూడా అలాగే వేయడంపై కొందరు పైప్‌లైన్ పనులను అడ్డుకుని, రోడ్డు ఒకే వెడల్పుతో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

'అధికార పార్టీది జారుడుబండ మేనిఫెస్టో'

జన్నారం: ఎన్నికల్లో భాగంగా అధికార పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో జారుడు బండ వల్లే ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఖలీందర్ ఆలీఖాన్ ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం గిరిజన మైనార్టీలకు రిజర్వేషన్ల పెంపు, గిరిజనులకు పోడుభూముల పట్టాలు నామమాత్రంగా ఇచ్చి చేతులు దులుపేసుకుందని ఆరోపించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసేలా ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీ హామీలను వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గంలో విస్తృతంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలియజేస్తూ, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, మాధవరపు రాజేశ్వర్‌రావు, చెలిమెల చంద్రమౌళి, రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో గడపగడపకూ ప్రచారంలో నేతలు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో లద్దునూరి ఐలయ్య, గాజుల కుమారస్వామి, టైలర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజా రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్ అభ్యర్థి కేటాయింపుపై త్వరలోనే నియోజకవర్గ ప్రజలకు శుభవార్త వస్తుందన్నారు. చెన్నూర్ సీటు పొత్తులో భాగంగా సీపీఐ, కాంగ్రెస్‌కు ఎవరికి కేటాయించినా అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలన్నారు.

ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావును చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో శనివారం సాయంత్రం గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ హామీలను ప్రజలకు వివరించారు.

వెడమ బొజ్జుకు ఘన స్వాగతం

జన్నారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నియామకమైన వెడమ బొజ్జుకు శనివారం జన్నారం మండలంలో కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. జన్నారం మండలంలోని పొన్కల్, కవ్వాల్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యకర్తలు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి భరోసానిచ్చారు. కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సూచించిన విధంగా గ్యారంటీ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫసీవుల్లా, రాజేష్, రాకేష్, పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నస్పూర్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, బీసీ అభ్యర్థినే సీఎంగా చేస్తామని ప్రకటించినందునా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు శనివారం నస్పూర్‌లో పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల రవి, పాషా, తడూరి మహేశ్, కొంతం మహేందర్, బద్రి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తామని హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తూ శనివారం జన్నారం మండల కేంద్రంలో బీసీ సంఘాలు, బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేవారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పొంతం శంకరయ్య, మండల అధ్యక్షుడు గోలి చందు, నాయకులు పాల్గొన్నారు.



పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రఘునాథ్

గ్రామాల్లో ఇంటింటా ఎమ్మెల్యే పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల్ల, నంనూర్, గుడిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శనివారం ఇంటింటా పర్యటించి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి విజయాన్ని అందించి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ అమలు చేయబోయే పథకాలతో బీఆర్‌ఎస్ ప్రజలకు మరింత చేరువ కానుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శారద, శ్రీనివాస్, లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, నాయకులు వోలపు రమేశ్, రత్నం, తిరుపతి, ఆరె శ్రీనివాస్, శ్రీధర్, కుడుక సత్యం, తిరుపతి, స్థానికులు పాల్గొన్నారు. రాపల్లి స్టేజీ, ధర్మారం గ్రామాల్లో స్థానిక మండల వ్యాపారి పూస్కూరి వరప్రసాదరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పథకాలను కరపత్రాల ద్వారా వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.



వేంపల్లిలో ఎమ్మెల్యే దివాకర్‌రావుకు స్వాగతం

విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు సహకరించాలి

కోటపల్లి: విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు సహకరించాలని హెచ్‌ఎం గుండేటి యోగేశ్వర్ అన్నారు. పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తలిదండ్రులతో సమావేశం నిర్వహించి, పది విద్యార్థుల మొదటి ఎస్‌ఏ పరీక్షల ప్రగతిపై చర్చించారు. పిల్లలు బడికి సక్రమంగా రావడానికి, విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు సహకరించి గొప్పగా ఎదిగేలా సహకరించాలని కోరారు. సమావేశానికి హాజరైన తలిదండ్రులకు విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి సాముహిక భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సతీశ్, నర్సింగ్, వాణిశ్రీ, విలాస్, సంతోష్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

దండేపల్లి: పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి, తగిన సలహాలు, సూచనలు చేయాలని, దండేపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటి వచ్చిన తర్వాత చదివేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, ప్రవర్తన తీరుతో పాటు పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛాలతో ఆహ్వానిస్తున్న విద్యార్థులు

'ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి'

బెల్లంపల్లి/చెన్నూర్: ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పార్టీల నేతలు దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు, బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇంటింటా ప్రచారం, స్ట్రీట్ మీటింగ్స్, మైక్‌వాడకం, వాహనాలకు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలన్నారు. నాయకులు అనుమతి కోసం 48గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతి పత్రాన్ని ఆ వాహనంపై అంటించాలన్నారు. ప్రచారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. ఒకే ఏరియాలో రెండు పార్టీల నుంచి దరఖాస్తులు వస్తే ముందు వచ్చిన దరఖాస్తుదారుడికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఏరియాలో తప్పనిసరిగా అనుమతి కావాలంటే సమయాల్లో మార్పు ఉంటుందన్నారు. మైక్ అనుమతి పొందిన వారు డీజే అనుమతిగా భావించవద్దన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. మా ఊరికి రావద్దని ప్రకటనలు ఇవ్వడం, పార్టీ నేతలను అడ్డుకోవడం నేరం కింద పరిగణించనున్నట్లు తెలిపారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలన్నారు. ఓటరు తమకు నచ్చిన పార్టీకి ఓటు వినియోగించుకొనే హక్కు, ప్రచారం చేసే హక్కును రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. రూ.50వేల కంటే ఎక్కువ మొత్తం సొమ్ముతో ప్రయాణం చేసే వ్యక్తులు తగిన పత్రాలను దగ్గరు ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 10గంటల తర్వాత ప్రచారం చేయొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

హనుమాన్ చాలీసా ప్రచార రథానికి స్వాగతం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తిరుమలతిరుపతి దేవస్థానం, హనుమాన్ దీక్షా పీఠం ఆధ్వర్యంలో చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ప్రచార రథం శనివారం హాజీపూర్ మండలానికి చేరుకుంది. గుడిపేట, నంనూర్, ధర్మారం, రాపల్లి, నర్సింగాపూర్, హాజీపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, రాంపూర్, దొనబండ, బుద్దిపల్లి, పెద్దంపేట, టీకానపల్లి గ్రామాల్లో శోభాయాత్రగా ఊరేగింపు జరపగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. 29వ తేదీ ఆదివారం హాజీపూర్ అనంతశ్రీ కాలనీలో దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసే అన్నప్రసాద వితరణలో భక్తులు పాల్గొనాలని మండల వాసి ప్రదీప, రమేశ్‌రెడ్డి తెలిపారు.



గుడిపేటలో హనుమత్ రథం వద్ద భక్తులు

కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం

మంచిర్యాలఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠం ఆధ్వర్యంలో కోటి హనుమాన్ చాలీసా మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రచారరథ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 30న మంచిర్యాల హనుమాన్ జంక్షన్‌కు ప్రచారరథం వస్తుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలి

జైపూర్: సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని తద్వారా ప్రమాదరహిత బొగ్గు ఉత్పత్తి, సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించిన వారమవుతామని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ బీహెచ్.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్షణబృందం సభ్యులు రమేశ్, రామ్మోహన్, భాస్కర్‌రావు, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, కొమురయ్య, రవీందర్, ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి రక్షణ పక్షోత్సవాల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, దానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను, పనిముట్లను వాడాలన్నారు. ఉద్యోగులు అందరూ బాధ్యతతో రక్షణపై శ్రద్ధ వహించడం మూలంగా ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా ప్రమాదరహిత బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నామన్నారు. అనంతరం ఉద్యోగులు రక్షణపై ప్రదర్శించిన నాటికను రక్షణబృందం అధికారులు తిలకించి అభినందనలు తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐకే-ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గని మేనేజర్ రవికుమార్, బ్రహ్మాజీరావు, నాగన్న, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, రక్షణాధికారి సతీశ్, సర్వేయర్ రవీందర్, డీవైడీఎం, డీవైఎస్సీలు నజీర్ అహ్మద్‌ఖాన్, రవీందర్, ఫిట్ ఇంజనీర్లు భీమన్న, సంక్షేమాధికారి అజ్మీరా రమేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.



రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, జీఎం సంజీవరావు, ఉద్యోగులు, అధికారులు

బొగ్గుబాయి వార్తలు

రక్షణలో రాజీ పడొద్దు

- ఓసీపీ పీఓ పురుషోత్తం రెడ్డి

శ్రీరాంపూర్: రక్షణలో రాజీ పడొద్దని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనిపై శనివారం 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్షణ జెండా ఆవిష్కరించి.. ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ నియమాలు పాటిస్తూ పనిచేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే కంపెనీకి శ్రేయస్కరం అన్నారు. దీని కోసం ఉద్యోగులు స్వీయ రక్షణతో పనిచేస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిలో రక్షణ చర్యలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్, ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కుల, గని రక్షణాధికారి శ్రీనివాస్, తనిఖీ బృందం అధికారులు నాగేంద్రకుమార్, శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుమురం భీం వర్ధంతి

లక్సెట్టిపేట: మండలంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద శనివారం కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సదస్సు విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ సదస్సు ఉంటుందని, ఈ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఇబ్రహీం పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

గిర్నీ అందించి.. ఉపాధికి అండగా నిలిచి

దండేపల్లి: మండలానికి చెందిన జమునకు వినికిడి లోపం ఉంది. వివాహం అయిన తర్వాత ఊట్నూర్‌లో ఉంటుంది. ఆమె కుటుంబం కష్టాల్లో ఉండటంతో దండేపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమెతో కలిసి చదువుకున్న 2000–01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, జమునకు ఉపాధి కల్పించేందుకు రూ.40వేలతో పిండిగిర్నీ కొనుగోలు చేసి ఆదివారం అందించారు. పిండిగిర్నీ నిర్వహణతో వచ్చే గిరాకీతో కొంత ఉపాధి కల్పించామని మిత్రులు పేర్కొన్నారు.

కొండాపూర్‌లో బీఎస్పీ ప్రచారం

దండేపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీఎస్పీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ కార్యవర్గం ఎన్నికలు

పాతమంచిర్యాల: ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కొంకుల రాజేష్, ఉపాధ్యక్షుడిగా మామిడాల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగం రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొగిలి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముత్తునూరి మహేష్, కోశాధికారిగా ఆంటోని దినేష్‌తో పాటు 9మంది కార్యవర్గ సభ్యులు, 25మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

భీమారం: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరిపైరుకు వివిధ రకాల తెగుళ్లు సోకినట్లు ఏఈవో అరుణ్‌కుమార్ గుర్తించారు. మండలంలోని ఆరెపల్లి శివారులోని పంట పొలాలను శనివారం ఆయన సందర్శించారు.